క్లుప్తంగా


అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని మధురవాడకు చెందిన దవళ వెంకట సూర్యనారాయణశర్మ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో అప్పలనాయుడు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

సుత్తమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో చిప్పాడ సుత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. బంతి, చామంతి, తులసి, మల్లెమాలలతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణలో భాగంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాదాలు, తాగునీరు అందించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్‌గా ఎస్.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను పెందుర్తి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంత వరకు పద్మనాభం తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్ బంగార్రాజు పెందుర్తి బదిలీ అయ్యారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరిధి కాపులుప్పాడ చెరువు నుంచి అనధికారికంగా నీటిని ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్న వారిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని భీమిలి జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి పేర్కొన్నారు. అక్రమంగా నీటి తరలింపుపై 'సాక్షి'లో బుధవారం ప్రచురించిన వార్తకు ఆమె స్పందించారు. అనధికారికంగా నీటిని ఎవరు తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మంచినీటి కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4 వ వార్డు జేవీ అగ్రహారం ఎస్సీ కాలనీలో ఏళ్ల తరబడి వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. గతంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో స్థానికులు ఇక్కడ మంచినీటి సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారని.., ఆయన ఆదేశాల మేరకు ఈ కుళాయిలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో 3, 4 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ, స్థానిక నాయకులు రామనాయుడు, రాము, తదితరులు పాల్గొన్నారు.

భళా... బాల మేధావులు

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు



దాకమర్రి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి వాసురాజు



పద్మనాభం కస్తూర్బాలో సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు



తయారు చేసిన నమూనాతో కేథరిన్ విద్యార్థులు

తగరపువలస : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బాలల మేధస్సు ఇనుమడించేలా పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. పలు విద్యాసంస్థల్లో రామన్ చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పరిశోధనలను ధ్రువపరచిన రోజు సందర్భంగా సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మండలంలోని దాకమర్రిలో సీవీ రామన్ చిత్రపటానికి దంతులూరి వాసురాజు నివాళులర్పించి విజ్ఞాన ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారతదేశం కీర్తిబావుటా ఎగురవేసిన ఏకైక నోబెల్ విజేత సీవీ రామన్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, కేవీ రమణ, మద్దిల శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమిలి కేథరిన్ 9వ తరగతి విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనా జిల్లా పరిధిలో ఉత్తమమైనదిగా ఎంపికైంది. జీవీఎంసీ భీమిలి జోన్ బంగ్లామెట్ట విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో సైన్స్ నమూనాలు ప్రదర్శించారు. రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ నమూనాలు ప్రదర్శించారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి విద్యార్థులకు ఆ సంస్థ అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు బహుమతులు అందించారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల మేధావులు తయారుచేసిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఫిజిక్స్, బయాలజీకి చెందిన పలు నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. వారు తయారు చేసిన నమూనాలు అనేక సమస్యలకు పరిష్కారం చూపేలా వుండడంతో పలువురు అభినందించారు. విజేతలకు అమరావతి జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌తోపాటు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ సందీప్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, డీన్ డిలేశ్వరరావు, సాయిరాం పాల్గొన్నారు.

అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో ముందుగా నోబెల్ బహుమతి విజేత సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో జరిగే అభివృద్ధిలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అధ్యాపకులు గొట్టేటి రవి, మాణిక్యంనాయుడు, త్రినాథరావు, మహాలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు సైన్స్‌కు సంబంధించిన చిత్రపటాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనీషా మాట్లాడుతూ సైన్స్ చక్కగా చదవడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ వుంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పద్మనాభం కస్తూర్బా విద్యాలయం, పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ విద్యార్థి సీవీ రామన్ వేషధారణలో అందరినీ అలరించాడు.



పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సీవీ రామన్ వేషధారణలో విద్యార్థి



నమూనా వివరాలు తెలియజేస్తున్న విద్యార్థి



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైట్ కళాశాల సిబ్బంది



చిత్రపటాలు ప్రదర్శిస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మేలు



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



మారికవలస ఆర్‌జీకే కాలనీలో మందులు అందజేస్తున్న వైద్యులు, నాయకులు

తగరపువలస : సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వీటితో అందరికీ మేలు జరుగుతోందని జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి అన్నారు. ఆదర్శనగర్ – 1 సచివాలయానికి సంబంధించి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఓల్డ్ మీ – సేవ కేంద్రంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది శిబిరాలపై ప్రజలకు అవగాహన కలిగించి ప్రతి ఒక్కరూ పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వమే మందులు ఉచితంగా అందిస్తూ అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 429 మందిని పరీక్షించారు. 34 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆరోగ్య అధికారి శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది డాక్టర్ ప్రవీణ్ వర్మ, డాక్టర్ సుష్మిత, ఎచ్చెర్ల హరి, వి.హారిక, ఆదినారాయణ, రమణమ్మ, ఫణీంద్రకుమార్, అర్చన, ధనలక్ష్మి, సచివాలయ అడ్మిన్లు ఆదిలక్ష్మి, మగడపల్లి సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి, చేట్ల నరసింగరెడ్డి, శీరపు నరసింహారెడ్డి, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, నమ్మి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరువలోనే ఆరోగ్య సేవలు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అత్యంత చేరువలోనే వైద్య సేవలు అందిస్తున్నారని మెడికల్ ఆఫీసర్ సాహితి, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి అన్నారు. మారికవలసలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరాల్లో గుర్తించిన వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్య, దిలీప్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రుషికేష్, కావ్యరెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

విలియం హువేకు ఘన నివాళి



తగరపువలసలో విలియం హువే చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

తగరపువలస : ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని తగరపువలసకు చెందిన శ్రీఎల్లమాంబ టైలర్స్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియం ఎలివేస్ హువే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పెంటపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెడీమేడ్స్, ఆన్‌లైన్ వ్యాపారాల తాకిడితో టైలర్లు ఉనికిని కోల్పోతున్న సమయంలో చేయూత పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.10వేలు ఇచ్చి ఆదుకుంటున్నారన్నారు. జగనన్న తోడు రుణాలు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వం టైలర్ల కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నూలు గోవింద, కార్యదర్శి చింతల సురేష్, సహాయ కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, కోశాధికారి కె.సత్యనారాయణ, సభ్యులు గుదే శ్రీనివాస్, ఎం.లక్ష్మణ్, ఎం.రమణ, బి.ఎస్.రావు, ఎ.నాగరాజు, ఆబోతుల నాగ్వేరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మిన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్ రెడ్డి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రవాణా శాఖ కార్యాలయానికి వివిధ అవసరాల కోసం వచ్చే వారు తాగునీటి కోసం ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో దివీస్ సంస్థ ముందుకొచ్చి రూ.13 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో 20 రోజుల్లో పనులు పూర్తి చేసి ఆర్వో ప్లాంట్‌ని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సుందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే వారికి తక్కువ సమయంలో ప్లాంట్‌ని నిర్మించి సురక్షిత మంచినీటిని అందించడానికి అందుబాటులోకి తెచ్చినందుకు దివీస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ వెల్ఫేర్ అధికారి ఎం.విజయ భాస్కర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జి.సి.రాజారత్నం, ఎంవీ ఇన్‌స్పెక్టర్లు వేణు, గోపాల్, బాలాజీరావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణానికి భూమిపూజ నేడు

తగరపువలస: విశ్వశాంతి కోసం తరచూ నిర్వహించే క్రతువులు, హోమాలు చేయడానికి భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ తాతానగర్‌లో యాగశాల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేయనున్నారు. ఉదయం 11.30కు జరిగే కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని భారతీయ సనాతన ధర్మ సంస్థాన్ వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి కోరారు.

రోడ్డుపై చెత్త వేస్తే సహించం



తిమ్మాపురంలో పర్యటిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

కొమ్మాది : ఎక్కడపడితే అక్కడ, రోడ్లపై చెత్త వేస్తే సహించేది లేదని భీమిలి జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి హెచ్చరించారు. జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో బుధవారం ఉదయం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా శానిటేషన్ విభాగం సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులు చెత్తను రోడ్డుపై పడేయకుండా వాహనాలకు అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రపరచుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ ఎన్టీఆర్ కాలనీ, బక్కన్నపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేష్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది, జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కే 1, కే 2, కే 3 కాలనీలు, ఎన్టీఆర్ కాలనీ, నవోదయ, బక్కన్నపాలెం, లచ్చిరాజు లే అవుట్, రైల్వే లే అవుట్, సీఆర్‌పీఎఫ్ పోలీసు బెటాలియన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని నరేష్ కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై పోటీలు



చిట్టివలస హైస్కూల్ విద్యార్థినులతో బ్యాంకు అధికారులు

తగరపువలస : భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బుధవారం బ్యాంకు అధికారులు చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్‌బీఐ లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు పీవీ రమణబాబు, ఎన్.మధుసూదనరావు పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన 10 మంది విద్యార్థినులకు మార్చి ఒకటిన కలెక్టర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందించనున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ రోజామణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభానికి కల్యాణ మండపం సిద్ధం

- రూ.50 లక్షలతో నిర్మాణం



నిర్మాణ పనులు పూర్తయిన కల్యాణ మండపం

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం, గిడిజాల పంచాయతీల సరిహద్దులో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. శొంఠ్యాం, గిడిజాల, కణమాం, ముచ్చర్ల తదితర గ్రామాల ప్రజలు శుభకార్యాలు చేసుకోవాలంటే కల్యాణ మండపం లేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ దశలో ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఆయన రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. త్వరలో కల్యాణ మండపం వినియోగంలోకి వస్తే నాలుగు పంచాయతీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

2న ఉపకరణాలకు గుర్తింపు శిబిరం

తగరపువలస: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా మార్చి 2న చిట్టివలస బంతాట మైదానంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సహకారంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ అలమ్కో సంస్థచే వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్, ట్రైపాడ్, స్పైనల్ సపోర్ట్, రొలేటర్ మొదలైనవి అందించనున్నారు. లబ్ధిదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, తెల్ల రేషన్ కార్డు, నెలకు రూ.15 వేలు ఆదాయం మించదని ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

మామిడి రైతుల ఆశలు ఆవిరి

- మాడిపోతున్న పూత
- కానరాని పిందెలు
- నష్టాలు తప్పవంటున్న రైతులు



మాడిపోయిన మామిడి పూత



ఆనందపురంలో పూతలేని మామిడి తోట

ఆనందపురం : ఈ ఏడాది వాతావరణ మార్పులు మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో ఇప్పటికే పూత, పిందెలతో కలకళలాడాల్సిన మామిడి తోటలు బోసిపోయినట్టు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పూత ముందే వచ్చినా ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన పొగ మంచు, తేనెమంచు వల్ల దెబ్బతింది. తేనె మంచు వల్ల పూతను ఆశించిన పురుగుల ఉధృతి పెరిగింది. దీనివల్ల చాలా వరకు పూత ఎండిపోయి నేలరాలింది. మామిడి పంటపై కోడిపేను, నల్లమంగు వంటి తెగుళ్లు సోకాయి. ముఖ్యంగా కోడిపేను పూతను తీవ్రంగా నష్టపరుస్తోందని, దీనివల్ల పూత నేలరాలుతోందని రైతులు తెలుపుతున్నారు. మండలంలోని గిడిజాల, కణమాం, రామవరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం, శొంఠ్యాం, పేకేరు, మామిడిలోవ, గండిగుండం తదితర గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో మామిడి పంట సాగవుతోంది.

సాధారణంగా డిసెంబర్ నెలలో కొత్త ఆకులు చిగురించి పూత వస్తుంది. ఈ ఏడాది కొత్త ఆకు చిగురించడం ఆలస్యం కావడం వల్లఆ ప్రభావం పూతపై పడిందని ఉద్యానవనాల శాఖాధికారులు తెలుపుతున్నారు. దీనికితోడు ఈ ఏడాది ఎండ తీవ్రత కూడా ఒక కారణంగా చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా మామిడి పంటను కోసి ఎగుమతి చేసి విక్రయించుకోగా, కొన్ని ప్రాంతాల్లో లీజు రూపంలో వ్యాపారులకు తోటలను అప్పగిస్తుంటారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో కాస్తో కూస్తో ఉన్న పూతకు తెగుళ్ల సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని మామిడి రైతులు దిగులు చెందుతున్నారు. ఉన్న పూతను రక్షించుకోవడానికి పెద్ద ఎత్తున పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని, దీంతో పంట పెట్టుబడి రెండు రెట్లు పెరిగిందని రైతులు తెలుపుతున్నారు. ఈ ఏడాది కనీసం పెట్టుబడులైనా వస్తే సంతోషమేనని అంటున్నారు. ఈ విషయమై మండల ఉద్యానవనాల శాఖ అధికారి సోని మాట్లాడుతూ అకాల వర్షాలు, వాతావరణ మార్పులు మామిడిపూతపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. పూత ఆలస్యం కావడంతో కొంత మేర దిగుబడి తగ్గుతుందన్నారు. మొగ్గ దశలో ఉన్న పూత రాలిపోకుండా ఉండడానికి ప్లానోఫిక్స్ మందు పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

పెట్టుబడులు రాని పరిస్థితి..



మామిడి తోటలకు ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా తెగుళ్ల సోకడంతో తీవ్ర నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. తోట దుక్కులు, మందులు పిచికారీ చేయడానికి చాలా ఖర్చు పెట్టాం. ప్రస్తుతం ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఉన్న కొద్దిపాటి పూత అయినా నిలబడితే నష్టాలు నుంచి కొంత మేర గట్టెక్కుతాం. వాతావరణంలో మార్పులు సంభవిస్తే ఫలసాయంపై ఆశలు వదులుకోవాల్సిందే.

– బొచ్చ నారాయణ, కణమాం రైతు